# వేటకుక్క

చుట్టూ ఎత్తయిన కొండల మధ్యనున్న అనాగరికపు పల్లెఅది. వెదురు బొంగులతో కట్టిన ఇళ్ళు. పైన రెల్లుకప్పు. అలాంటి ఇళ్లు ఆపల్లెలో మొత్తం నలభై ఉంటాయి. అక్కడి ప్రజలు చాలా అనాగరికులు. పురుషులకు ఒంటిమీద గోచి మాత్రమే ఉంటుంది. ఇక పిల్లలు పదేళ్లు వచ్చేంత వరకు ఆడ, మగా, తేడాలేకుండా నగ్నంగా తిరుగుతుంటారు. పదేళ్ళ తరువాత ఆడ పిల్లలు జానెడు వెడల్పుండే జింక చర్మాన్ని మొలకు చుట్టుకుంటారు. పద్నాలుగేళ్ళు వచ్చిన తరువాత బెత్తెడు వెడల్పుకల అలాంటి చర్మాన్నే వక్షద్వయానికి చుట్టు కుంటారు. అది పెళ్ళయ్యేంత వరకే. పెళ్ళి అయిన తర్వాత గుండెల మీద కప్పుకున్న ఆ చర్మాన్ని మాత్రం తీసేసి ఫ్రీగా సంచరిస్తారు. మగవాళ్ళు పదేళ్ళనుంచే జానెడు పొడవున్న చర్మాన్ని చుట్టుకుంటారు. ఇక ముసలివాళ్ళయ్యేంతవరకు అదే వారి వస్త్రధారణ. వాళ్ళ ప్రధాన వృత్తి వేట.

అప్పుడే ఒక జీపు కొండల మీద ఘాటు రోడ్డులోంచి వచ్చి ఆ పల్లె మధ్యదూసు కుపోయింది. మట్టిలో అడుకుంటున్న పిల్లలు ఆ జీపు దుమ్మువెంట కొంతదూరం పరుగెత్తి అది వేగంగా అడవి చెట్లమధ్య కొండమీదికి వెళ్ళిపోయేసరికి వెనకు క్క వచ్చేసారు.

అదే సమయంలో వీధిలో ఒకవైపు వేపచెట్టు క్రింద పడుకొని ఉందొక వేటకుక్క. అది చాలా బలహీనంగా విచారంగా ఉంది. అది ఇప్పటినుండి కాదు. గత కొంతకాలం నుంచి అలాగే ఉంటోంది. అది ఒకప్పుడు బాగా వేగంగా వేటాడేజాగిలం. అడివిలో కుందేళ్ళు, జింకలూ, తోడేళ్ళేకాదు, చిరుతపులులు సైతం భయపడేవి దాని వాడైన కోరలుచూసి, అంత భయంకరంగా ఉండేది. దానికి సాక్ష్యం ఇపుడు శరీరంలో కండలు కరిగిపోయినా చెక్కు చెదరక నిలచిన బలిష్టమైన ఎముకలే.

జీపు వెళ్ళిపోయిన తర్వాత దానికి దుమ్ములోంచి ఒక రకమయిన వాసన సోకి దాని ముక్కుపుటాలు విశాలమయ్యాయి. ఒకటికి నాలుగుసార్లు ఆ గాలిని పీల్చి వదిలింది అంతే... దానికి ఒక్కసారిగా జవసత్వాలు వచ్చాయి. చప్పునలేచి నిలబడింది. శరీరం మీద దుమ్ము దులుపుకొని శరీరాన్ని చాపి నీలిగింది. తర్వాత ఉరుకులు పరుగులతో జీపు వెళ్ళిన వైపు రాకెట్‌లా ముందుకు దూసుకుపోయింది.

• • •  • • •  • • •

ఆ కోయ గూడెపు దొరకూతురు మున్నీ. ఆమె వయస్సు ఇరవైఏళ్ళు. విశాలంగా బలంగా ఉన్న పొడవైన కాళ్ళు. అందమైన ముఖం సుకుమారంగా కనిపించినా కఠినంగా ఉన్న దేహం. ముఖంలో రాజకళ ఉట్టిపడుతోంది.

ఆమె పధ్నాలుగేళ్ళకే వేటలో ఆరితేరింది. ఆమె సహచరుడు రాజా. అంటే కుక్క మేలుజాతి వేటకుక్క అది. భుజాన వల తగిలించుకుని చేతిలో బల్లెంపట్టుకుని రాజాను

తీసుకుని వెళ్ళిందంటే సాయంత్రానికి నాలుగు కుందేళ్ళో లేక రెండు లేళ్ళో, ఒక జింకో ఆస్థాయికి తగ్గ ఏదో ఒక జంతువును వేటాడందే తిరిగిరాదు.

రాజా మాటలు రాని వేటకుక్కే అయినా తన యజమానురాలి సంజ్ఞల్ని శ్రద్ధగా అర్థం చేసుకుంటుంది. ఆమెకు ఎంతో విశ్వాసంగా ఉంటుంది. మాటలు రావన్న మాటేగాని తన యజమానురాలిని గుండెల నిండా ప్రేమిస్తుంది. భక్తితో వినమ్రంగా మోకరిల్లుతుంది.

ఆరోజు మున్నీ రాజాను తీసుకుని వేటకు బయలుదేరింది. దూరంగా ఉన్న కొండ మొదలు దగ్గరకు చేరింది. పైన కొండమీంచి జలపాతం దడ దడ మని శబ్దం చేస్తూ అక్కడ పడుతోంది. జలపాతంపడే స్థలానికి కొద్దిదూరంలో ఒక చెట్టు ఉంది.

మున్నీ రాజా చెట్టు క్రిందకి వచ్చారు. మున్నీ చేతిలోని బల్లెం భూజాన ఉన్నవల క్రిందపెట్టింది. తరువాత గుండెలు కప్పిఉన్న మెత్తని జింక చర్మాన్ని విసిరివేసింది. తరువాత నడుముకున్న తోలుబొందు సడలించి పులిచర్మం చెట్టు క్రిందపడవేసింది.

ఇపుడు ఆమె నగ్నంగా వనకన్యలా ఉంది.

తరువాత ఆనందంగా నవ్వుతూ జలపాతం క్రిందకి వచ్చి నిలబడింది. పై నుంచి వేగంగా పడే నీళ్ళు ఆమె నెత్తిమీద పడి శరీరాన్ని తడుపుతున్నాయి. ఆమె నవ్వుకుంటూ స్నానం చేస్తోంది. ఆమె వేటకు వెళ్ళేప్పుడు స్నానం చేస్తుంది. సాయంత్రం తిరిగి వచ్చేప్పుడు స్నానం చేస్తుంది. ఇదే అమె స్నానం. ఇంటి దగ్గర మళ్ళీ స్నానమంటూ ఉండదు. ఈమే కాదు. గూడెంలో ఉండే చిన్నా పెద్దా అంతా చేసే పని ఇదే. ఎక్కడో కొండవాగుల్లో, జలపాతాల్లో స్నానంచేసి తిరిగి వస్తూంటారు.

దూరంగా కొండ పైనుండి బైనాక్యులర్స్ లోంచి అడవిని పరిశీలించి చూస్తున్న ఫారెస్టు ఆఫీసరు రాజారామ్ కంట్లో ఈ దృశ్యం పడింది. అతని కప్పుడెప్పుడో ఇంగ్లీషు సినిమాల్లో చూసిన లేడీ టార్జాన్ గుర్తొచ్చింది. అందులో కూడా ఇంతే. ఒక అడమనిషి ఇలాగే జలపాతం క్రింద స్నానం చేస్తుంటుంది. అయితే అది సినిమా. ఇది యదార్థం.

ఆమె స్నానం చేస్తున్నంత సేపూ పిచ్చివాడిలా చూస్తున్నాడు రాజారామ్. ఆమె స్నానం చేసి వచ్చి మెత్తని పచ్చికలో వెల్లకిలా పడుకుంది. సూర్యకాంతే ఆమె తడి పీల్చాలి. ఆ దృశ్యం అతనికి ఎంతో మనోజ్ఞంగా ఉంది. గోవా బీచ్‌లో విదేశీయులు చేసే సన్‌బాత్ చాలా కృత్రిమంగా ఉంటే ఇంది ఎంతోసహజంగా, అపూర్వంగా ఉంది.

ఓ పదిహేను నిమిషాల తరువాత లేచి నడుముకు. ఎదమీద చర్మాల్ని బిగించింది చేతిలోకి బల్లెం తీసుకుంది. ఆమె అక్కడనుంచి కొంత దూరం క్రిందికి దిగింది. ఉన్నట్లుండి రాజా ఒక పెద్దపొద చుట్టూ అరుస్తూ తిరగసాగింది. మున్నీ అలర్టయిపోయింది. కుక్క అరుపులకు లోపల దాక్కుని ఉన్న లేడి ఒక్క ఎగురుతో బయటికి పరుగెత్తింది. మున్నీ వెంటనే విసురుగా వలను విసిరింది, ఒక చివర పట్టుకుని. కాని... అది తప్పించుకుంది.

ముందు లేడి, వెనుకనే బల్లెం పట్టుకుని మున్నీ. పెద్దగా అరుస్తూ ఆమెను అనుసరిస్తోంది వేటకుక్క రాజా. పెద్ద పెద్ద పొదల్ని సహితం అతి వేగంగా దాటేస్తోంది

లేడి. అదే వేగంతో అంతే నేర్పుతో ఆరడుగుల ఎత్తున్న పొదల్ని ఎగిరి దాటుతోంది మున్నీ. రాజా కూడా విసరేసిన అగ్ని కణంలా గాలిలో ఎగురుతోంది.

ఈ దృశ్యాన్ని చూసిన రాజారామ్ ఆమె పరిగెత్తే వేగానికి ఆశ్చర్యపోతున్నాడు. జంతువుకు ఆమెకు లేడా కనిపించడం లేదు. ఏం జరుగుతుందోనన్న ఆతృతతో ఎదురు చూస్తున్నాడు రాజారామ్.

అలా కొద్ది దూరం పరుగెత్తిన మున్నీ ఇక లాభం లేదని చేతిలోని బల్లాన్ని వేగంగా విసరింది అది గాలిని చీల్చుకుంటూ సర్రున వచ్చి లేడి వీపును గుచ్చుకుంది. ఆ దెబ్బకు లేడి గిలగిలలాడుతూ క్రింద పడిపోయింది. ఆమె ఆనందంగా దాని శరీరంలోంచి బల్లెం పెరకి దాన్ని భూజాన వేసుకుని ముందుకు నడిచింది.

దూరంగా ఈ దృశ్యాన్ని చూస్తున్న రాజారామ్ బైనాక్యులర్స్ తీసి బ్యాగులో పెట్టుకుని చేతిలోని రైఫిల్‌తో జీపును చేరుకున్నాడు. అతను గెస్ట్ హౌస్‌కు వెళ్ళినా అతనికళ్ళముందు మున్నీ మెదులుతోంది. ఆ రాత్రంతా అతని కలల్లో ఆమె నగ్న రూపమే. కొన్ని దృశ్యాల్లో తను కూడా నగ్నంగా స్నానం చేసినట్లు వచ్చాయి కలలు.

రాజారామ్ వరుసగా వారం రోజుల పాటు అదేచోటుకి వచ్చి బైనాక్యులర్స్‌లో ఆమె నగ్న సౌందర్యాన్ని కనువిందు చేసుకునేవాడు. ఒక రోజు ఆమె నగ్న స్వరూపాన్ని దగ్గర్నుండి చూడాలన్న కోరిక అతనిలో బలంగా తలెత్తింది.

ఆరోజు ఆమె వచ్చేందుకు ఓ గంట ముందుగా కొండమీద జీపును ఉంచి మెల్లిగా క్రిందికి వచ్చాడు. అతి జాగ్రత్తగా జలపాతం ప్రక్కనే కొండను ఆనుకొని ఉన్న ఒక పొదలో చేరాడు. అలవాటు ప్రకారం మున్నీవచ్చి నగ్నంగా తయారై జలపాతం కింద చేరింది. రాజా చిన్నగా మొరిగింది. అటూ ఇటూ చూసిన మున్నీ యధేచ్ఛగా స్నానం చేయసాగింది. పొదల్లోంచి రెమ్మలు తప్పించుకుని చూస్తున్న రాజారామ్ గుండె గొంతులో కొట్టుకోసాగింది. ఆమె నగ్నత్వం అతని శరీరంలోని రక్తాన్ని పరుగులు తీయిస్తోంది.

రాజా మళ్ళీ చిన్నగా మొరిగింది. మొరుగుతూ వచ్చిన రాజా వేగంగా పొదలోదూరి రాజారామ్‌కోటు నోటితోపట్టుకుని బలంగా బయటకు లాగింది. రాజారామ్ బయటకు రాకతప్పలేదు. అరమోడ్పు కన్నులతో ఆనందంగా స్నానం చేస్తున్న మున్నీ తనకెదురుగా అత్యంత దగ్గరలో నిలబడి ఉన్న రాజారామ్‌ని చూడగానే చప్పున పొదచాటుకు పరుగెత్తింది.

“ఏయ్ ఎవర్నువ్వు ఈడికెందు కొచ్చినవు” అంటూ అరిచింది.

అతను చిరునవ్వు నవ్వాడు. అతని చిరునవ్వు ఆమెకు ఒళ్ళుమండించింది. రాజాకు సంజ్ఞచేసింది. రాజా నిముషంలో చెట్టు క్రింద ఉన్న పులితోలు పట్టుకొచ్చింది. చప్పున దాన్ని అందుకొని నడుముకు బిగించుకుంది. రెండవ చర్మాన్ని గుండెలకు చుట్టుకుంది.

చేతిలోని బల్లెంతీసుకుని అతని గుండెలకు గురిపెట్టి నిలబడింది. “ఎవ్వర్నువ్వు చెప్పు. ఈ మున్నీ వొళ్ళు దిగంబరంగా సూత్తావా. దానికేం సిచ్చో తెలుసా. ఈ మున్నీ నీ గుండెల్లోకి బల్లెం దింపద్దీ” అంటూ వ్యంగ్యంగా నవ్వింది.

రాజారామ్ చలించలేదు. "నీ ఇష్టం మున్నీ. నీ వాడైన ఈటెను నాగుండెల్లోకి దింపి ఫారెస్టు ఆఫీసరు రాజారామ్‌ను చంపి హంతకివి అవుతావో లేక నీ ప్రేమ బాణాల్ని నా గుండెల్లోకి దింపి సేదతీరుస్తావో" అన్నాడు.

మున్నీ క్షణం చలించిపోయింది. తమ కోయ గుడెం వాళ్ళు తమ కోయదేవత తరువాత, అంత భక్తిగా పూజించేది ఫారెస్ట్ ఈఫీసర్లని. తమ బ్రతుకుదెరువు కోసం జంతువుల్ని అమ్ముకున్నా కాదనరు. అందుకే తన అయ్య గూడెంలో వాళ్ళ కందరికీ చెప్పాడు. ఫారెస్టు ఆఫీసర్లని దేవుళ్ళా చూసుకోవాలని. అందుకే తమ గూడెం పెద్దలు ఎంతో అభిమానంగా అప్పుడప్పుడు తేనె, పళ్ళు తీసుకువెళ్ళి ఆఫీసర్లకి సమర్పిస్తుంటారు.

అలాంటి దేవుడైన ఆఫీసరు తనకళ్ళ కెదురుగా నిలబడేసరికి మున్నీ వణికిపోయింది. వెంటనే ఈటె అవతలపడేసి రాజారామ్ కాళ్ళ మీద పడిపోయింది.

ప్రేమగా రాజారామ్ మున్నీని భుజాలు పట్టుకొని పైకిలేపి నడుముచుట్టూ చేయివేసి దగ్గరకు తీసుకున్నాడు.

"సామే. ఇది సానాతప్పు సామే" అంది మున్నీ విడిపించుకుంటూ.

"ఏది తప్పు మున్నీ. నిన్ను ప్రేమించడం తప్పా. ఇష్టమయిన నిన్ను పెళ్ళి చేసుకోవడం తప్పా" అన్నాడు ఆమెను ఇంకా అదుముకుంటూ.

"సామే. ఇది జరిగేపని కాదుసామే. నానెక్కడ? తమరెక్కడ? అడివికాయలు, అడివి జంతువులు తిని బ్రతికేదాన్ని నేను. తమరు పట్నంలో హాయిగా కార్లలో తిరిగే టోళ్ళు" నిరాశగా అంది.

"లేదు. మున్నీ కార్లలో తిరిగినా, పట్నంలో గడిపినా నేను నీలా మనిషినే కదా మున్నీ. మనకు కొన్ని తరాలకు పూర్వం మనుషులు ఎలా ఉండేవారో తెలిస్తే నువ్విలా మాట్లాడవు" అన్నాడు ప్రేమగా ఆమె వెన్ను నిమురుతూ. ఆమె శరీర స్పర్శ అపుడే వికసించిన పువ్వుల్ని స్పర్శించినట్లుంది రాజారామ్‌కు.

"ఏటో సామే. నాకు భయంగా ఉండాది" అంది మున్నీ అతని స్పర్శకు వరవశించి పోతూ.

"ఏంభయపడకు" అన్నాడు రాజారామ్.

ఆరోజు నుంచి రాజారామ్, మున్నీ ప్రతీరోజు ఉదయమూ సాయంత్రమూ ఆ ప్రదేశంలో తప్పక కలుసుకుంటున్నారు. మున్నీ ఇచ్చే ఆనందం అతనికి స్వర్గలోకంలో విహరించినట్లుగా ఉంది. మున్నీకి కూడా అంతే. తన అందాలన్నీ అతని ముందు పరచి, అతని అనుభవంలో తనూ సగం పంచుకుంటోంది. ఇలా సంవత్సరం గడిచిపోయింది.

ఆరోజు అది నిజంగా మున్నీకి దుర్దినం లేకపోతే ఈ విషయం ఎత్తదు.

రాజారామ్, మున్నీ ఇద్దరూ గడ్డిలో కూర్చుని ఉన్నారు. ఆ సందర్భంలో "సామే. రేపు అదివారం మనం కొండదేవత గుళ్ళో పెళ్ళి చేసుకుందాం" అంది మున్నీ.

"అలాగేలే మున్నీ, ఇపుడేం తొందర" అన్నాడు ఎప్పటిలాగే.

"ఇక ఆలస్యం చేయడానికి లేదుసామే. బుల్లిసామె కూడా పుట్టబోతుండె" అంది ముసిముసిగా నవ్వుతూ.

అదిరిపడ్డాడు రాజారామ్. "ఏమిటి మున్నీ, నువ్వనేది" అన్నాడు తన అదిరిపాటు కప్పిపుచ్చుకుంటూ.

"అవునా సామే. నాకిప్పుడు మూడోనెల కడుపు" అంది మున్నీ కళ్ళు మూసుకుని తన్మయత్వంతో మునిగిపోతూ.

రాజారావుకు ఏవేవో ఆలోచనలు వచ్చాయి. గత నెల నుంచి మున్నీలో ఎంతో మార్పు. మత్తుగా ఉంటుంది. ప్రతి మాట భావయుక్తంగా మాట్లాడుతుంది. స్వల్పమైన ప్రతి స్పర్శకు ఎంతో మురిసిపోతుంది. నగ్నంగా ఉన్న ఆమె పొట్ట ఇపుడిపుడే రంగులీను తోంది. తప్పించుకు పోవడానికి మార్గాలు ఆలోచించసాగాడు.

"అలాగేలే మున్నీ, వచ్చే ఆదివారం కోయదేవత గుడి దగ్గర మనువాడుదాం. ఇంకా అయిదు రోజులుందిగా. నేనీలోగా పట్నం వెళ్ళి వస్తా" అన్నాడు.

"సామె జాగ్రత్తగా ఎల్లిరా. నీకోసం ఎయ్యికన్నుల్తో యెదురుసూత్తుంటా" అంది మున్నీ అతని గుండెల మీద తలవాల్చి కన్నీరు కారుస్తూ.

అక్కడ నుంచి వచ్చిన రాజారామ్ గెస్ట్‌హౌస్‌కి వచ్చి మూటాముల్లె సర్దుకుని అక్కడనుంచి ఉడాయించాడు. నెలరోజులు మెడికల్ లీవుపెట్టి వేరేచోటుకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు.

కన్నులు కాయలు కాచేట్లు చూసింది మున్నీ. ఆ అదివారం పోయింది. మళ్ళీ ఆదివారం పోయింది. అలాంటి ఆదివారాలు ఇంకో పదిపోయాయి. కాని అతను రాలేదు.

ఆమె ఆకలి దాహం మరచి అతనికోసం ఎదురుచూడసాగింది. తాను స్నానం చేసే జలపాతం ఎదురుగా నిలబడి పిచ్చిగా చూసేది. తాము తిరిగిన ప్రదేశాలన్నీ తిరిగి తిరిగి చూసుకునేది. ఆమె పరిస్థితి ఆమె తండ్రికి అయోమయంగా ఉంది. ఏమడిగినా ఏం చెప్పదు. ఎన్నో మంత్రాలు. ఎన్నో తాయెత్తులు కట్టించాడు అయినా ఆమె ధోరణిలో మార్పులేదు. రాజా కూడా ఆమె వెనకాలే తోకాడిస్తూతిరిగేది. దానికీ తెలుసు ఆమెకి జరిగిన అన్యాయం. కాని నోరేది ఓదార్చడానికి.

ఒక రోజు మున్నీకి అసలు విషయం తెలిసింది. కొత్త ఫారెస్టు ఆఫీసరు వచ్చాడని. పాత ఆఫీసరు దూరంగా వేరేచోటుకు పోయాడు. స్వచ్ఛమైన తన మనసును అతడికి అంకితం చేసింది. అలాంటి తన మనసులోకి ఇంకొకరిని ఆహ్వానించలేదు. అందుకే అర్ధరాత్రి గూడెం నుంచి బయలు దేరి వెళ్ళి కొండశిఖరం ఎక్కి అక్కడ్నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది.

అందరితోబాటు తనూ కుళ్ళి కుళ్ళి ఏడ్చింది వేట కుక్క రాజా యజమానురాలి చావుకి. ఆమె చావుకి కారణం ఎవరో తనకు తెలుసు. కాని చెప్పడానికి నోరు ఏది?

• • •    • • •    • • •

రాజా అడ్డదారిన చెట్లను చీల్చుకుంటూ కొండ మీదికి పరుగెత్తుతోంది. బయట చాపిప నాలుకలోంచి చొంగ కారుతోంది. ఆయాసంతో దాని డొక్కలు ఎగిరిపడుతున్నాయి.

'అవును తన అంచనా కరెక్టే. మళ్ళీ తన యజమానురాలి దగ్గర సుఖం జుర్రుకోవడానికి వచ్చాడు. తన ప్రతీకారం తీర్చుకోవడానికి ఇదే అదను' అనుకుంటోంది.

రాజారామ్ జలపాతం కెదురుగా నిలబడి నాటి అనుభూతుల్ని స్మరించుకుంటున్నాడు. 'మున్నీ తనువెళ్లి పోయానని తెలిసి ఏవో అడవి కాయలు తిని కడుపు పోగొట్టుకుని ఉంటుంది. ఇప్పుడు తననుచూసి సంబరపడిపోతుంది' అనుకుంటూ ఎదురుచూస్తున్నాడు.

ఇంతలో రాజా అతనికెదురుగా రొప్పుతూ నిలుచుంది "హాయ్ రాజా! ఎక్కడ మా మున్నీ" చేయి ఊపుతూ చిలిపిగా అన్నాడు.

రాజా వెనుకకు తిరిగి నాలుగడుగులు వేసి అతనివైపు చూసింది రమ్మన్నట్లు. రాజారామ్ దాన్ననుసరించాడు, తాను అనుభవించబోయే మున్నీ అందాల్ని స్మరించుకుంటూ.

రాజా అతన్ని కొండ శిఖరాగ్రానికి తీసుకుపోయింది. కొండలకు అటు వైపు అగాధం లాంటి లోయ. అక్కడ ఆగింది.

"ఏమిటే ఇక్కడకు తీసుకువచ్చావ్. మున్నీ ఏది" అన్నాడు రాజారామ్ ఆయాసం తీర్చుకుంటూ.

అతనికి నాలుగడుగుల దూరంలో రాజా నిలబడిఉంది. అది అతనివైపే చూస్తోంది. దాని కళ్ళలో అగ్ని కణాలు చిమ్ముతున్నాయి.

దానితోక ఆవేశంతో అటూ ఇటూ ఊగుతోంది. బాధను కంట్రోలు చేసుకుంటున్నట్లు వేడి నిట్టూర్పులు విడుస్తోంది.

దాని వాలకం చూసిన రాజారామ్ భయపడిపోయాడు. ఏదో మాట్లాడబోయేంతలో యెగిరి అతని గుండెల మీద పడింది. అంతబరువైన రాజా ఊహించని వేగంతో తనను ఢీకొనేసరికి వెల్లకిలా పడిపోయాడు రాజారామ్. రాజా వాడైన పళ్ళతో అందిన చోటల్లా కండలు ఊడొచ్చేలా పీక సాగింది. ఆ బాధకు తట్టుకోలే కున్నాడు రాజారామ్. దాన్ని నెట్టేయడానికి అతని చేతులకు శక్తి చాలడంలేదు. తప్పించు కోవడానికి వెనక్కు వెనక్కు జరగసాగాడు. అతను కొండ అంచుకు వచ్చేశాడు. అతని తల క్రిందకి వ్రేలాడుతోంది. అగాధంలా ఉన్న లోయను చూడగానే అతను వణికి పోయాడు. క్రింద మహామహా వృక్షాలు అతని కంటికి చిన్న చిన్న మొక్కల్లా కనిపిస్తున్నాయి. అతని గుండె ఠారుమంది. రాజా తనను పెట్టే బాధకంటే చనిపోవడమే మేలనిపిస్తోంది అతనికి. ఇంతలో అతని తలక్రింద ఒక రాయి దొర్లింది. దడదడమంటూ ఆ కొండ అంచుకూలిపోయింది. దాంతోపాటు రాజారామ్ శరీరం కూడా అగాధంలో పడిపోయింది ✸

**(స్వాతి వీక్లీ, తేది 22-5-1987)**